# ప్రతిస్పందన

"మీరేదో రాస్తున్నట్టున్నారే?"

"అవును... కనిపిస్తూనే ఉందికదా... అడగడమెందుకు?

"యేం రాస్తున్నారేమిటి?"

"కథ"

"ఎవరికథ?"

"ఎవరిదన్నా కావొచ్చు... నీది మాత్రం కాదు"

"నా కథ మీరెందుకు రాస్తార్లెండి"

"రాయకూడదా?"

"నాలో యేం ప్రత్యేకతుందని రాస్తారు? ఎవరి గురించైనా రాయాలంటే వాళ్ళల్లో ఎవరిలోనూ లేని యేదో ఒక ప్రత్యేకతుండాలి కదా!"

"అలాగా... నాకీ విషయం తెలియదే!"

"జోకా?"

"నీలో యే ప్రత్యేకతా లేదంటావా?"

"యే ప్రత్యేకతా లేదు. నేనో మామూలు మనిషిని"

"మామూలు మనిషినంటే?"

"పెద్ద అందగత్తెను కాను. బాగా డబ్బున్న వాళ్ళ కుటుంబంలో పుట్టినదాన్ని కాను. కనీసం మీకు భార్యగా వస్తున్నప్పుడైనా కట్నం, కానుకలంటూ దండిగా తెచ్చుకున్నదాన్ని కాను. వేన్నీళ్ళకు చన్నీళ్లలా నేనో ఉద్యోగం చేస్తూ మీకు సహాయపడ్తున్న దాన్నీ కాను..."

"ఇవన్నీ నీ ప్రత్యేకతలనే ఎందుకనుకోకూడదు. వీటిని ఆధారం చేసుకుని "ఓ మామూలు మనిషి" అనే పేరుతో ఓ కథ రాసెయ్యొచ్చు, రాయమంటావా?"

"వద్దులెండి. అలాంటి యే ప్రత్యేకతలూ లేని నాలాంటిదాన్ని గూర్చి మీరు కథ రాస్తే దాన్నెవరూ చదవరు. ఇంత పేరున్న రచయిత ఇంత మామూలు కథ రాశాడేమిటని మిమ్మల్ని తిట్టిపోస్తారు. ఇప్పుడు మీకున్న ఆ పేరు కాస్తా పోతుంది"

"పోతే పోనీయ్‌లే... ఈసారి రాసే కథ మాత్రం నీ మీదనే రాస్తాను"

"వద్దు. ఆ పనిమాత్రం చెయ్యొద్దు. నా మీద రాస్తే నేనూరుకోను"

"యేం చేస్తావేమిటి?"

"ఇంట్లోంచి వెళ్లిపోతాను..."

"నిజంగా నిజంగా వెళ్ళిపోతావా?"

"నిజంగా నిజంగా వెళ్ళిపోతావా అని అంత రెట్టించి అడుగుతున్నారు. మీ ధోరణి చూస్తోంటే నేను వెళ్ళిపోవాలనే మీరు కోరుకుంటున్నట్టున్నారు?"

* * *

అనురాగ్ చాలా అందంగా ఉంటాడు.

ఎర్రగా నిగనిగలాడ్తున్న శరీరం. ఆరడుగుల ఎత్తు; ఎత్తుకు తగ్గలావు. ఉంగరాల జుట్టు. విశాలమైన నుదురు. హుషారుగా మెరిసే పెద్దపెద్ద కళ్లు. ఆజానుబాహుడు. ఎప్పుడూ అతని అందాన్ని ఇనుమడింపజేసే దుస్తులే వేసుకుంటాడు. యే బాలివుడ్‌లోనో హాలీవుడ్‌లోనో వెలిగిపోవలసిన ఈ అద్భుత వ్యక్తి ఓ బ్యాంక్ ఉద్యోగిగా స్థిరపడిపోవడమేమిటని అతనికి తెలిసిన వాళ్ళందరూ ఆశ్చర్యపోతుంటారు.

అనురాగ్ ట్రిమ్‌గా తయారై ఆఫీసుకు బయల్దేరాడు. తళతళ మెరుస్తున్న తెల్లటి షర్ట్ మీద నల్లటి ప్యాంట్‌తో టక్ చేశాడు. చేతిలో బ్రీఫ్‌కేసు పట్టుకొని

"అపర్ణా!" అని కేకేశాడు.

"వస్తున్నానండి" అంటూ వంట గదిలోంచి అతని భార్య అపర్ణ కొంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చి అతని ముందు నిల్చుంది.

"ఈ రోజు నేను ఇంటికొచ్చేటప్పటికి ఆలస్యం కావొచ్చు. మా ఫ్రెండ్ శ్రీకాంత్ ఇంట్లో పార్టీ ఉంది. ఈ రోజు అతని ఫస్ట్ మారేజిడే"

"యేదో కంపెనీకి మేనేజర్‌గా పనిచేస్తాడు. ఆ శ్రీకాంతేనా?" అంది అపర్ణ.

"అవును... ఆ శ్రీకాంతే..."

"మీరొచ్చేటప్పటికి ఎంత టైమవుతుంది?"

"రాత్రి పదికావొచ్చు. నా కోసం వెయిట్ చెయ్యొద్దు. నువ్వు భోజనం చేసేసి హాయిగా నిద్రపో..."

"హాయిగా నిద్రపోవడం నాకు సాధ్యమయ్యే పని కాదని మీకు తెలుసు. మీరొచ్చేదాకా అనుక్షణం మీ కోసమే ఎదురు చూస్తుంటాను..."

"అదే వద్దన్నాను. అతడు ఇద్దర్నీ రమ్మన్నాడు. నిన్ను కూడా తీసికెళ్తే పోయేది"

"కానీ మీరు నన్ను తీసికెళ్లరుగా..."

"తీసికెళ్లొద్దని కాదు... ఆఫీసు నుండి మళ్ళీ ఇంటిదాకా రావడమంటే ఈ హైదరాబాద్ ట్రాఫిక్‌లో ఎంత కష్టమో నీకు తెలీదా? మా ఆఫీసు నుండి వాళ్ళ ఇల్లు చాలా దగ్గర."

"మీరు తీసికెళ్ళడం లేదనే బాధ నాకేం లేదులెండి... మీరు వెళ్ళిరండి"

"సాధ్యమైనంత త్వరగా రావడానికే ప్రయత్నిస్తాను."

అంటూనే అతడు పోర్టికో కింద పార్క్ చేసున్న కార్లోకి వెళ్లి స్టార్ట్ చేసుకొని వెళ్ళిపోయాడు.

ఆమె కారు గేటుదాటి బయటకు వెళ్ళిపోయేంత వరకు చూసి గేటు మూసేసి లోపలకు వెళ్ళిపోయింది.

ఆమె చూడటానికి అతి మామూలు స్త్రీలా ఉంది. పొడుగూ కాదు. పొట్టికాదు. ఎరుపుకాదు, నలుపూకాదు. ఛామనఛాయ. ఐదడుగుల ఎత్తు, చిన్న జడ, చిన్న కళ్ళు, ఆమెనూ, అతన్నీ పక్కపక్కనే చూసిన వాళ్ళకు వీళ్లు "మేడ్‌ఫర్ ఈచ్ అదర్" లా లేరేమిటి అనిపిస్తుంది. అంత అందమైన అతనికి ఇంత మామూలు స్త్రీ భార్యగా రావటమేమిటని వాళ్ళను చూసిన వాళ్ళందరూ అతని మీద జాలిని ఒలకబోస్తుంటారు. అనురాగ్ సాయంత్రం యేడింటి దాకా ఆఫీసులో ఉండి, మూసేశాక మారేజి డే ఫంక్షన్‌కు బయల్దేరాడు.

శ్రీకాంత్-అనుపమల మ్యారేజిడే ఆ సిటీలోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్లో జరుగుతోంది.

వాళ్ళ ఫస్ట్‌మ్యారేజి డే ఫంక్షన్‌కి అతిథులు చాలామందే వచ్చారు.

కళ్ళు జిగేలుమనిపించే ఆ వాతావరణం భూతల స్వర్గాన్ని తలపింపజేస్తోంది.

వచ్చిన వాళ్లందరి కళ్లూ శ్రీకాంత్ భార్య అనుపమ మీదే ఉన్నాయి.

అనుపమది అనితరసాధ్యమైన సౌందర్యం.

ఆమె పక్కన నిల్చున్న శ్రీకాంత్‌ను చూసినవాళ్ళకు 'కాకి ముక్కుకు దొండపండు' అన్న మాట గుర్తొస్తుంది.

వాళ్ళింకాస్సేపట్లో కేక్ కట్ చెయ్యబోతుండగా దగద్ధగాయమానంగా వెలిగిపోతున్న ఆ హాల్లోకి అనురాగ్ ప్రవేశించాడు. అనురాగ్‌ను చూడగానే శ్రీకాంత్

"కమాన్ అనురాగ్, ఇంత ఆలస్యం చేశావేమిటి? నీ కోసమే చూస్తున్నా. కమాన్ ప్లీజ్" అన్నాడు అతనికి ఎదురుగా వెళ్ళి

"సారీ శ్రీకాంత్! ఈ రోజు ఆఫీసులో పని మరీ ఎక్కువగా ఉంది" అన్నాడు అనురాగ్.

"నిన్ను మా అనుపమకు ఇంట్రడ్యూస్ చేస్తానురా" అంటూ అతన్ని అనుపమ దగ్గరకు తీసికెళ్ళాడు.

"డియర్ అనూ! ఇతడెవరో తెలుసా?" అన్నాడు శ్రీకాంత్ ఎవరితోనో మాట్లాడుతున్న అనుపమ భుజం మీద చెయ్యేసి.

మరుక్షణంలో అనుపమ కళ్ళన్నీ అనురాగ్ మీదనే... అనురాగ్ కళ్ళన్నీ అనుపమ మీదనే.

"ఈ అద్భుత వ్యక్తి ఎవరై ఉంటారు?" అనుకుంది అనుపమ.

"శ్రీకాంత్‌కు ఇంత అందమైన భార్యుందా?" అనుకున్నాడు అనురాగ్.

"ఎవరో గుర్తొచ్చిందా?" అన్నాడు శ్రీకాంత్.

"లేదు... గుర్తు రావడం లేదు..." అందామె అతన్నే చూస్తూ.

"అనురాగ్... నా బెస్ట్ ఫ్రెండ్" అన్నాడు శ్రీకాంత్.

"నైస్ మీటింగ్ యూ" అందామె తన చేతిని అతని చేతితో కలుపుతూ.

"అనురాగ్ మన పెళ్ళికొచ్చాడు..."

"మన పెళ్ళికి చాలామందే వచ్చారు. ఈయనను చూసినట్టు గుర్తేలేదు..."

"పెళ్ళిలో ఈమెను పరీక్షగా చూడనే లేదు" అనుకున్నాడు అనురాగ్.

"అనురాగ్ స్టేట్ బ్యాంక్‌లో ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. హీ ఈజ్ ఎ వెరీ నైస్ గై యునో..." అన్నాడు శ్రీకాంత్.

"ఆ విషయం మీరు చెప్పాల్సిన పనిలేదు... అతన్ని చూస్తేనే తెలుస్తోంది... ఇదేమిటి అనురాగ్! మీరొక్కరే వచ్చారేమిటి? మీ బెటర్‌హాఫ్‌ను తీసుకురాలేదేమిటి? మీరే ఇంత అందంగా ఉన్నారు. మీ బెటర్‌హాఫ్ ఇంకెంత అందంగా ఉంటుందో ఊహించుకోలేకపోతున్నాను..." అంది అనుపమ అనురాగ్ కళ్ళల్లోకి ఆరాధనాభావంతో చూస్తూ.

"నేను ఆఫీసు నుండి చక్కగా ఇటే వచ్చేశాను. మా ఆఫీసు నుండి మా ఇల్లు ఇరవైకిలోమీటర్ల దూరం ఉంటుంది. ఆమె కోసం వెళ్తే యే ట్రాఫిక్ జామ్‌లోనో ఇరుక్కుపోయేవాడిని..." అన్నాడు అనురాగ్.

"నోనోనో... ఇలాంటి సాకులు చెప్పొద్దు. ఇప్పటికైనా వెళ్ళి మీరామెను తీసుకు రావాలి. నేనామెను చూడాలి. మీరిద్దర్నీ పక్కపక్కనే చూస్తే ఎంత ఫెంటాస్టిక్‌గా ఉంటుందో..." అందామె కళ్ళుమూసుకొని కలల్లోకి వెళుతూ.

"ఎంత ఫెంటాస్టిక్‌గా ఉంటుందోనని ఊహించుకోవడంలోనే ఆనందం ఉంటుంది. నిజంగా చూస్తే అంత ఆనందం కల్గకపోవచ్చు..."

"ఎందుకలా అంటున్నారు..."

"మా జంటను గూర్చి పెద్దగా ఊహించుకోకండి. ఆమె చాలా మామూలుగా ఉంటుంది"

"రియల్లీ?" అందామె బోల్డు ఆశ్చర్యాన్ని కనబరుస్తూ.

ఆశ్చర్యంతోబాటు ఆమె కళ్ళల్లో ఒకలాంటి ఆనందం కూడా వ్యక్తమయిందేమో... అనుకున్నాడు అనురాగ్.

"కమాన్ డార్లింగ్... ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది. గెస్టులందరూ వెయిట్ చేస్తున్నారు" అన్నాడు శ్రీకాంత్.

"హ్యాపీ మ్యారేజ్‌డే" అని అందరూ చప్పట్లు కొడ్తొంటే వాళ్ళు కేక్ కట్ చేశారు.

* * *

"మీరు రాస్తున్న కథ పూర్తి చేశారా? ఇంకా రాయాలా?"

"చదివేశావా యేమిటి?"

"అడిగిందానికి సమాధానం చెప్పండి"

"పూర్తి కాలేదు. ఇంకా చాలా రాయాలి. ఎవరైనా సరే, పూర్తికాకముందే నేను రాసే కథల్ని చదవడం నా కిష్టం ముండదు..."

"నాకా విషయం తెలుసు"

"తెలిసినా ఎందుకు చేశావా పని"

"చదివానని మీ రెందుకనుకుంటున్నారు. చదివానని నేను చెప్పలేదే..."

"వేరే చెప్పాలా? నీ మొఖం చూస్తేనే తెలుస్తోంది"

"యేం తెలుస్తోంది"

"నువ్వు చదివావని"

"చదివానని నా మొఖం మీద రాసుందా?"

"నీ ముఖకవళికల్లో నువ్వు చదివావని సూచించే రాత కనిపించింది"

"నా రాత అలా ఉన్నప్పుడు మీరేం చేస్తార్లెండి"

"నీ రాత అలా ఉండటమేమిటి?"

"మీ మెడకు చుట్టుకోవాలని దేవుడు నా మొఖాన రాసినప్పుడు మీరేం చేస్తారు?"

"నువ్వు నా మెడకు చుట్టుకున్నావని ఎవరన్నారిప్పుడు?"

"ఎవరూ అన్లేదు. నాకే అనిపించింది"

"ఎందుకనిపించింది?"

"అనిపించిందంతే... రాత కాకపోతే మీరెక్కడ? నేనెక్కడ? నేనో అతి మామూలు మనిషిని. మీ పక్కన నిలబడటానిక్కూడా అర్హత లేనిదాన్ని"

"అరె... యేడుస్తున్నావా? యేమైందిప్పుడు? ఎందుకేడుస్తున్నావు? ఊరుకో... ప్లీజ్..."

"మిమ్మల్నో కోరిక కోరతాను, తీరుస్తారా?"

"మొదలా ఏడ్పు మానెయ్..."

"మానేస్తాను... నా కోరిక తీరుస్తారా చెప్పండి"

"మొదలు కోరికేమిటో చెప్పు"

"తీరుస్తానని మాటివ్వండి"

"తీర్చగల్గితే తీరుస్తాను..."

"మీరు తీర్చగలరు"

"అయితే చెప్పు..."

"తప్పకుండా తీర్చాలి"

"ప్రయత్నిస్తాను... చెప్పు"

"నాకు విడాకులిచ్చేసి అన్ని విధాలా మీకు తగిన దాన్ని చూసి పెళ్ళి చేసుకొని సుఖంగా ఉండండి"

"నీకేమన్నా పిచ్చెక్కిందా? నిన్నేమన్నానని ఇలా మాట్లాడుతున్నావు..."

"మీరు నన్నేమీ అన్లేదు. నాకు పిచ్చి కూడా ఎక్కలేదు. చాలా మంచి హృదయం తోటే మాట్లాడుతున్నాను. నేను మీకు యే విధంగానూ తగినదాన్ని కాను. ఆ విషయం మీకూ తెలుసు. నాకూ తెలుసు. నాకు అందమూ లేదు. ఐశ్వర్యమూ లేదు. పది మందిలోకొచ్చి మెదలగల్గే తెలివితేటలూ లేవు. పెద్దగా చదువుకున్నదాన్ని కూడా కాను. పెద్దల బలవంతం మీద చేసుకున్నారు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. విడాకుల పత్రం మీద సంతకం చేస్తాను"

"నువ్వేమీ అంత త్యాగం చెయ్యాల్సిన అవసరం లేదు. నేను నిన్ను పెద్దల బలవంతం మీద చేసుకోలేదు. ఇష్టపూర్వకంగానే చేసుకున్నాను. నువ్వు నాకు తగినదానివి కావని నేననుకోవడం లేదు"

"మీరనుకోవడం లేదు. కానీ నేననుకుంటున్నాను"

"నువ్వు కూడా అనుకోవద్దు. ఎప్పటిలాగే మామూలుగా ఉండు. గొప్ప త్యాగం చేసి మహా పతివ్రతననిపించుకోవాలని కలలుగనకు"

"కలలుగనటం లేదు. నా మొఖానికి కలలు కూడానా?"

"అదే వద్దంటున్నాను. నిన్ను నువ్వు తక్కువ చేసుకోవద్దంటున్నాను. యేదేదో ఊహించుకొని మనస్సు పాడుచేసుకోకు"

* * *

శ్రీకాంత్ పెట్టి పుట్టాడనిపించింది.

అంత అందం, అంత ఐశ్వర్యం ఉన్న భార్య దొరకడం ఎంత అదృష్టం... అనుకున్నాడు అనురాగ్.

అపర్ణ అమాయకురాలు. తనంటే ఆమెకు పిచ్చి ప్రేమ. కానీ ఆమెకు అందమూ లేదు. ఐశ్వర్యమూ లేదు. బంధువులమ్మాయి. ఆమె చిన్నప్పుడే ఆమె తల్లీ తండ్రీ చనిపోయారు. మేమమామలింట్లో పెరిగింది. ఆమెను చేసుకొమ్మని ఆమె తరపు బంధువులందరూ తన మీద వొత్తిడి తెచ్చారు. ఎందుకో స్పష్టంగా చెప్పలేదుగానీ తనకూ అపర్ణను చేసుకోవాలనే అనిపించింది. అది జాలికావచ్చు. మరేదన్నా కావచ్చు. అలా తమ పెళ్ళయిపోయింది. అపర్ణ తన జీవితంలో ప్రవేశించింది. పైసా కట్నం లేకుండా ఓ పేదవాళ్ళ అమ్మాయిని చేసుకున్నందుకు తమ బంధువుల్లో కొందరు ప్రశంసించారు. కొందరు తెలివి తక్కువ పనిచేశావన్నారు.

వాళ్ళిద్దరి కాపురం సాఫీగానే సాగుతోంది కానీ ఈ రోజు శ్రీకాంత్, అనుపమల్ని చూశాక అతనికి మొదటిసారిగా తనో పెద్ద పొరపాటు చేశాడేమో ననిపించింది.

శ్రీకాంత్, అనురాగ్‌లు ఎం.బి.ఏ చదువుతున్న రోజుల్లో క్లాసుమేట్స్. శ్రీకాంత్ వాళ్ళకంటే అనురాగ్ వాళ్ళే బాగా ఉన్నవాళ్ళు. అందుకే శ్రీకాంత్ అనురాగ్‌ను చాలా గౌరవించేవాడు. ఎప్పుడన్నా డబ్బు అవసరం పడితే అనురాగ్‌ను అడుగుతుండేవాడు. అనురాగ్ అతడికి ఎన్నోసార్లు డబ్బిచ్చాడు. ఆనాడు తను చేసిన సహాయం కారణంగానే శ్రీకాంత్ ఎం.బి.ఏ పూర్తిచేసి ఓ పెద్ద ప్రైవేట్ కంపెనీకి మేనేజర్ కాగల్గాడు. ఒకప్పుడు తన మీద ఆధారపడి బతికిన శ్రీకాంత్ ఇవ్వాళ్ళ తను అందుకోలేనంత ఎత్తుకు

ఎదిగిపోయాడు. అతడలా ఎదిగిపోవడానికి అతని భార్య కూడా ఒక కారణం. అనుపమను చేసుకోవడంతో శ్రీకాంత్ జీవితం ఒక అద్భుతమైన మలుపు తిరిగింది. అనుపమలాంటి అందమూ, ఐశ్వర్యమూ పుష్కలంగా ఉన్న అమ్మాయిని చేసుకుంటే తన జీవితం కూడా ఆకాశహర్మ్యాల మీదకు చేరుకునేది.

శ్రీకాంత్ అనుపమల మ్యారేజ్ డే ఫంక్షన్ చాలా రసవత్తరంగా సాగిపోతోంది. ఓ ప్రఖ్యాత గాయని ఆర్కెస్ట్రా సందడితో లేటెస్ట్ సినిమా పాటలు పాడటం మొదలెట్టింది.

గెస్టులందరికీ లిక్కర్స్ సర్వ్ చేశారు.

శ్రీకాంత్ స్వయంగా విస్కీగ్లాసు తెచ్చి అనురాగ్‌కు ఇవ్వబోయాడు.

"సారీ శ్రీకాంత్! నేను విస్కీ తీసుకోవడం మానేసి చాలా కాలమైంది" అన్నాడు అనురాగ్.

"ది సీజ్ జెన్యూన్‌స్కాఛ్! చాలా బావుంటుంది. కొంచెం తీసుకో. జస్ట్ వన్ పెగ్ ఫర్‌మై ప్లెజర్..." అన్నాడు శ్రీకాంత్.

"ఫర్ అవర్ ప్లెజర్" అంటూ అక్కడికి అనుపమ వచ్చేసింది.

"నేను స్టూడెంట్ డేస్‌లో కొంచెం తీసుకునేవాడిని. కానీ ఇప్పుడు మానేశాను" అన్నాడు అనురాగ్ ఆమె అందమైన కళ్లల్లోకి అదేపనిగా చూస్తూ.

"కొంచెం తీసుకోండి. ఫరవాలేదు. మీకేంకాదు. మీ ప్రాణానికి నా ప్రాణం" అందామె అతన్ని కళ్ళనిండా నింపుకుంటూ.

"టేక్ కేరాఫ్ హిమ్" అంటూ శ్రీకాంత్ మరో గెస్టు దగ్గరకెళ్ళాడు.

ఆమె అతనికి మరింత దగ్గరగా వచ్చింది. ఆమె శరీరం మీది నుండి ప్రవాహంలా వస్తున్న సెంట్ వాసన అతనికి మత్తెక్కిస్తున్నట్టనిపించింది. ఆమె శరీర స్పర్శ అతన్ని మరో ప్రపంచంలోకి పంపించింది.

"అబ్బే... అదేం లేదు. ఓ.కె! మీ కోసం తాగుతాను" అంటూనే ఆమె మరో చేతిలో ఉన్న విస్కీ గ్లాసు అందుకున్నాడు. ఆమె కేసే చూస్తూ కొంచెం సిప్ చేశాడు.

"మీరు నన్ను తాగుతున్నారా? విస్కీ తాగుతున్నారా?" అందామె అందంగా నవ్వుతూ.

"అది మీరే చెప్పాలి" అన్నాడు మరోసారి విస్కీ సిప్ చేస్తూ.

ఆమె మళ్ళీ నవ్వింది. ఆమె అలా నవ్వుతోంటే ఇంకా అందంగా కనిపించింది.

ఎప్పుడో యూనివర్శిటీలో చదువుకునే రోజుల్లో క్లోజ్ ఫ్రెండ్స్‌తో కలిసి బీర్ తాగుతుండేవాడు. పెళ్ళయ్యాక అపర్ణ తనను తాగొద్దంది. తాగనని ఆమెకు ప్రామిస్ చేశాడు. అంతే! మానేశాడు. మళ్ళీ ఈరోజు తాగుతున్నాడు. అనుపమ తన అపూర్వ సౌందర్యంతో తనను మెస్మరైజ్ చేసింది. కళ్ళు మిరిమిట్లు గొల్పే సౌందర్యం ఆమెది. ఆమెలో ఉన్న ఆ సమ్మోహన శక్తికి తను వశమైపోయాడు.

గంటలు క్షణాల్లా గడిచిపోయాయి.

ఆమె అతన్ని విడిచి ఎక్కడకూ వెళ్ళలేదు.

అతని చేత కొసరి కొసరి తాగించింది. కొసరి కొసరి తినిపించింది. అతనికి ఎన్నో జోక్స్ చెప్పి నవ్వించింది. అతడూ ఆమెకు జోక్స్ చెప్పాడు. ఒకరి మీద ఒకరు పడిపోతూ నవ్వారు. చుట్టూ ఉన్న వాళ్ళంతా వాళ్ళనే చూశారు. వాళ్ళను చూస్తున్న వాళ్ళందరికీ "మేడ్ ఫర్ ఈచ్ అదర్" అంటే అలా ఉండాలి అనిపించింది.

"అప్పుడే పన్నెండున్నరయిపోయింది? నేనిక బయల్దేరుతా" అన్నాడు అనురాగ్. ఈలోగా వాళ్లదగ్గరకు శ్రీకాంత్ కూడా వచ్చాడు.

"ఇంత రాత్రి నువ్వు ఓ ముప్పై కిలోమీటర్లు డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళకపోతే యేం? ఈ హోటల్లోనే రూం తీసుకుంటాం... ఈ రాత్రి ఇక్కడే పడుకొని రేపు మార్నింగ్ వెళ్ళండి" అంది అనుపమ.

"లేదు... నేను తప్పకుండా వెళ్ళాలి" అన్నాడు అనురాగ్.

"మీరు కొంచెం డ్రింక్ తీసుకున్నారు. డ్రైవింగ్‌లో పొరపాటు జరిగి మీకేమన్నా అయితే మేం జీవితాంతం బాధపడాలి. ఈ రాత్రికిక్కడే ఉండిపోండి. ప్లీజ్" అంది అనుపమ అతని చేతులు పట్టుకొని బతిమాలుతూ.

"డ్రైవ్ చెయ్యలేనంత ఎక్కువగా నేనేం తాగలేదు. అయామ్ ఆల్‌రైట్. నేను వెళ్ళగలను. మిమ్మల్ని జీవితాంతం బాధ పడేలా చెయ్యను... ప్లీజ్ లెట్‌మీగో..." అన్నాడు అనురాగ్.

"ఈ అర్ధరాత్రి మీరంత దూరం వెళ్లకపోతే యేమవుతుందంటారు... ఆకాశం ఊడి భూమ్మీద పడిపోదు కదా..." అంది అనుపమ అతన్ని ఎలాగైనా ఆపాలన్న పట్టుదలతో

"పోనీయ్, ఉండిపోరాదు. రేపు లేస్తూనే వెళ్ళిపోదువుగానీ..." అన్నాడు శ్రీకాంత్.

"మీరన్నట్టు వెళ్లకపోతే ఆకాశం ఊడి భూమ్మీద పడదు. నిజమే... కానీ ఇంట్లో అపర్ణ ఒక్కతే తెల్లవార్లూ నాకోసం ఎదురుచూస్తూ బిక్కుబిక్కుమంటూ కంటిమీద రెప్పవెయ్యకుండా ఉండిపోతుంది..." అన్నాడు అనురాగ్.

"అదా సంగతి... మీ బెటర్ హాఫ్ పేరు అపర్ణ అని చెప్పేశారు... థాంక్స్... మీకు అపర్ణ అంటే చాలా ఇష్టమా?" అంది అనుపమ.

"చాలా ఇష్టమొ కాదో చెప్పలేనుగానీ ఇప్పుడామె దగ్గరకు వెళ్ళడం నా డ్యూటీ అని మాత్రం చెప్పగలను" అన్నాడు అనురాగ్.

"డ్యూటీకి ఇష్టానికీ తేడా యేమిటో?" అంది అనుపమ. అతడు హోటల్ బయటకొచ్చేశాడు. శ్రీకాంత్ మరెవర్నో సాగనంపటానికెళ్లాడు. ఆమె మాత్రం అతని వెంటే అతడు కారెక్కేదాకా వచ్చింది.

"నేనంటే మీ కిష్టంలేదా?" అందామె అతడు కార్లోకి వెళ్లబోతుండగా.

"మీరు నా బెస్ట్ ఫ్రెండ్ వైఫ్ మీరంటే ఇష్టం ఉన్నా ఆ మాట చెప్పలేను"

"ఓహో! ఇష్టం ఉన్నా ఇష్టం ఉందని చెప్పకపోవడం డ్యూటీ కాబోలు"

"అవును... డ్యూటీకి, ఇష్టానికి తేడా యేమిటో ఇప్పుడు మీకు అర్థమైందనుకుంటాను... సో బై..."

"బై... గుడ్‌నైట్... స్వీట్ డ్రీమ్స్... జాగ్రత్తగా వెళ్ళండి" అందామె అతడు బయటకు వెళ్ళేవరకు చేతులు ఊపుతూ.

అతడు నెమ్మదిగా డ్రైవ్ చేసుకుంటూ మెయిన్ రోడ్డు మీదకొచ్చాడు.

రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. అతని బుర్ర నిండా అసంఖ్యాకమైన ఆలోచనలు.

ఈ రాత్రి ఈ హోటల్లోనే ఉండిపోతే ఆమె తన గదిలో కొచ్చేదేమో. తన బిగికౌగిలిలో ఆమెను ఊహించుకున్నాడు. ఆమె బలమైన వక్షోజాల మధ్యలో తన తలను దాచుకుంటే ఎంత హాయిగా ఉండేదో!

అంత హాయిని కాలదన్నుకొని అపర్ణకోసం పరిగెత్తడం ఎంత అవివేకం! అవివేకమా? వివేకమా? అపర్ణతో తనకు ఏర్పడిన బంధం చాలా గట్టిదే. ఆమె రోజూ తనకు చేస్తున్న సేవలన్నీ గుర్తొచ్చాయి. ఆమె లేకుండా తను బతకలేనని అతనికి చాలా సార్లనిపించింది. ఆమెను ఆనందంగా ఉంచడం తన ధర్మం. తన డ్యూటీ. ప్రేమ, ధర్మం రెండూ ఒకటేనా? వేర్వేరా? యేమో తెలీదు. కానీ అనుపమను అంత అద్భుత సౌందర్యరాశిని వదిలేసి రావడం వల్ల ఎంత ఆనందాన్ని కోల్పోయాడో.

ఆమె శరీరపు వొంపులన్నీ అతని కళ్ళలో మెదిలాయి. అతని కేదో మైకం కమ్మినట్టుగా అనిపించింది. కళ్ళు మూసుకుపోతున్నట్టుగా యేదో కమనీయం ప్రపంచంలోకెళ్ళిపోతున్నట్టుగా... ఆ ప్రపంచంలో తనూ అనుపమ తప్ప ఇంకెవరూ లేరు. ఆమె సౌందర్యాన్నంతా జుర్రుకుంటూ తను స్వీట్ డ్రీమ్స్‌లో కెళ్ళిపోయాడు.

అతడు నెమ్మదిగా డ్రైవ్ చేసుకుంటు ఇల్లు చేరుకొని "థాంక్ గాడ్, క్షేమంగా చేరాను" అనుకున్నాడు.

హారన్ చప్పుడు విన్న మరుక్షణమే అపర్ణ వచ్చి గేటు తెరిచింది. నిద్రకు దూరమై ఆమె అనుక్షణం తన కోసమే ఎదురు చూస్తూ ఉండటం అతన్ని ఆశ్చర్యపరచలేదు.

కారును పోర్టికో కింద పార్క్ చేసి నెమ్మదిగా కార్లోంచి బయటకొచ్చి ఆమె భుజం మీద చెయ్యేసి ఇంట్లోకొచ్చాడు.

అతన్నుండి వస్తున్న విస్కీ వాసనను ఆమె గమనించింది.

"మీరు ...మీరు...తాగొచ్చారా?" అంది అపర్ణ అతని మొఖంలో మొఖం పెట్టి బాధ, ఆశ్చర్యం మిళితమైన గొంతుతో.

"అవును...కొంచెం తాగాను... చాలా కొంచెమే తాగాను. జస్ట్ వన్‌పెగ్. నీక్కోపం వస్తుందని తెలుసు. కానీ తప్పలేదు. నా ఫ్రెండ్ శ్రీకాంత్ నీకు తెలుసుగా... కానీ అతని భార్య అనుపమ నీకు తెలీదు. ఆమెను నువ్వెప్పుడూ చూళ్ళేదు. నేనూ ఆమెను ఒక సారి వాళ్ళ పెళ్ళిలో చూశాను గానీ అది చూడటం కాదు. ఆమెను నిజంగా చూసింది ఈ రోజే. సింప్లీ మార్వెలెస్. నువ్వామెను చూస్తే మూర్ఛపోతావు. నాకూ మూర్ఛపోయినంత పనయింది. ది ఫేస్ దట్ లాంచ్డ్ దౌజెండ్ షిప్స్. షీ ఈజ్ హెలెన్ ఆఫ్ ట్రాయ్. రంభ, ఊర్వశి, మేనక... వీళ్ళెలా ఉంటారో నేను చూళ్ళేదు. వాళ్ళ అందాన్ని వర్ణించగా విన్నాను. వాళ్ళందర్ని మించిన అందం అనుపమది. ఇంత అందాన్ని నేనిదివరకెప్పుడూ చూళ్ళేదు. అంత అందమైన మనిషి ఈ ప్రపంచంలో నిజంగా ఉంటుందనుకోలేదు. అంత అందమైన స్త్రీ ఒక పెగ్ తీసుకోండి అని బలవంతం చేస్తే ఎలా కాదనడం చెప్పు. నువ్వే చెప్పు అపర్ణా... నువ్వే చెప్పు... నువ్వే చెప్పు..." అలా మాట్లాడుతూనే అతడు బెడ్ మీద పడిపోయి నిద్రపోయాడు. ఆమె అతని పక్కనే కూర్చొని తెల్లవారే వరకు నిశ్శబ్దంగా యేడుస్తూ ఉండిపోయింది.

*　　　*　　　*

"మీరు చదువుకునే రోజుల్లో తాగేవారా?"

"నీ కెందుకొచ్చిందా సందేహం?"

"ఊరికేనే, పొద్దుపోక అడిగాను"

"ఊరికేనే అడగలేదు..."

"మరెందుకడిగానంటారు?"

"ఎందుకడిగావో నీకే తెలియాలి"

"ప్రత్యేకమైన కారణమేమీ లేదు. అడగాలనిపించింది. అడిగాను. అంతే"

"ఎందుకడగాలనిపించిందో నేను చెప్పనా?"

"చెప్పండి"

"నేను రాస్తున్న కథ చదివావు"

"చదవలేదు. మీ కథలు చదివి అర్థం చేసుకునేంత తెలివి నాకెక్కడుంది లెండి"

"అర్థం చేసుకునే తెలివితేటలు లేకపోయినా అపార్థం చేసుకునే తెలివితేటలు మాత్రం మీ అడవాళ్ళకు వెన్నతోబెట్టిన విద్య"

"మీ ఆడవాళ్ళు అంటున్నారు. ఎంతమంది ఆడవాళ్ళను చూశారేమిటి?"

"ఎంతమందిని చూడాలేమిటి? అన్నం ఉడికిందో లేదో చూడటానికి అన్నమంతా చూస్తారా?"

"మీకు సామెతలు బాగానే వస్తాయే..."

"మీ ఆడవాళ్ళనుండే నేర్చుకున్నాను"

"మీకు చదువుకునే రోజుల్లో చాలామందే అందమైన గర్ల్ ఫ్రెండ్స్ ఉండుంటారు... అవునా?"

"అవును... చాలా మంది జగదేకసుందరీమణులతో నాకు ఫ్రెండ్‌షిప్ ఉండేది. అయితే ఇప్పుడేమంటావు?"

"వాళ్ళల్లో ఎవర్నో ఒకర్ని ప్రేమించే ఉంటారు."

"ఒకర్నేం కర్మ, చాలా మందినే ప్రేమించాను ప్రేమించగల్గే హృదయం ఉంటే ఎంత మందినైనా ప్రేమించవచ్చు"

"మీ అందాన్ని చూసి ఎంతోమంది ఆడపిల్లలు మీ వెంట పడుంటారు. మీరసలు ఓ పెద్ద సినిమా హీరో కావలసినవారు. మీరు సినిమాల్లోకి ఎందుకు వెళ్ళలేదో నా కర్థం కాదు..."

"పోనీయ్ ఇప్పుడు వెళ్ళమంటావా?"

"వెళ్ళమనే అంటున్నాను. నాలాంటి యే ప్రత్యేకతలూ లేని ఓ అభాగ్యురాలితో జీవితాంతం కాపురం చేస్తూ మీ జీవితాన్ని నాశనం చేసుకోవడమెందుకు? నేను మళ్ళీ చెబుతున్నాను. నేను మీ జీవితంలోంచి వెళ్ళిపోవడానికి రెడీగా ఉన్నాను. నాకు విడాకులిచ్చేసి ఓ కోటీశ్వరురాలిని, జగదేకసుందరిని చూసి చేసుకోండి. ఆమె భుజాల మీద చేతులు వేసి ఫైవ్‌స్టార్ హోటల్లో స్కాచ్ విస్కీ సేవిస్తూ జీవితాన్ని ఎంజాయ్ చెయ్యండి."

"విడాకులు విడాకులని తెగ మురిసిపోతున్నావు. అదో గొప్ప త్యాగమనుకుంటున్నావా? విడాకులు తీసుకొని ఎక్కడకెళ్తావు? నా జీవితంలోంచి వెళ్ళిపోయిన మరుక్షణంలో నీ జీవితం కుక్కలు చించిన విస్తరైపోతుంది. వీధుల్లో అడుక్కుతింటావు. అతి తెలివికిపోయి చేజేతులా జీవితాన్ని నాశనం చేసుకోకు"

"నా జీవితాన్ని నాశనం చేసుకుంటానని మీరెందుకు బాధ పడిపోతున్నారు? నాకా బాధ లేదు. మీ జీవితాన్ని బాగు చేశానన్న తృప్తినాకుంటుంది"

"నా జీవితానికిప్పుడొచ్చిన ప్రమాదమేమీలేదు. యేదో గొప్ప త్యాగం చేస్తున్నానన్న భ్రమలో పడిపోయి పిచ్చిగా ప్రవర్తించకు. సాఫీగా సాగిపోతున్న మన జీవితంలో తుఫాను సృష్టించకు. కథలు చదివి ఇదంతా నా గురించే రాశాడని ఊహించుకోకు. నేను రాస్తున్న కథలకూ, నీకూ ఎలాంటి సంబంధం లేదు. అర్థమైందా?"

"అర్థమైంది... నాకు జీవితమూ సాహిత్యం వేర్వేరు కావని మీరు చాలాసార్లు చెప్పగా విన్నానే!"

"వింటే?"

"యేం లేదులెండి. నేనో పిచ్చిదాన్ని లెండి. యేదేదో మాట్లాడేసి మిమ్మల్ని విసిగించినట్టున్నాను. సారీ!"

"యేడుస్తున్నావా? ఇప్పుడు నిన్నేమన్నానని యేడుస్తున్నావు. ఇట్లా ప్రతి చిన్న విషయానికీ యేడ్చే వాళ్ళంటే నా కసహ్యం..."

"అందుకే చెబుతున్నా... ఇంత అసహ్యించుకుంటూ నాతో ఎందుకు కాపురం చేస్తారు. నన్ను వదిలెయ్యండి. నా దారి నేను చూసుకుంటాను"

"నా దారి నేను చూసుకుంటాననడంలో యేమిటి నీ ఉద్దేశ్యం? చచ్చిపోతాననా? ఆత్మహత్య చేసుకుంటాననా? నా ఆత్మహత్యకు నా భర్తే కారణమని రాసిపెట్టి..."

"లేదు... అలా ఎప్పటికీ రాయను. నా చావుకు నేనే కారణమని రాస్తాను..."

"అవును. పతివ్రతవు కదా. అలాగే రాస్తావు. అసలు ఆత్మహత్య చేసుకునేంత కష్టం నీ కిప్పుడేమొచ్చింది? నేను నిన్ను కట్నం తేలేదని హింసిస్తున్నానా? నువ్వు అందగత్తెవు కాదని ఇంకొకరితో సంబంధం పెట్టుకున్నానా? ఎందుకు... ఎందుకు నువ్విలా బాధపడ్తూ నన్ను బాధ పెడ్తావు?? ఛీఛీ! ఈ ఇల్లో నరకమైపోయింది. ఓమూల కూర్చొని యేదన్నా రాసుకుందామంటే ఈ ఇంట్లో అలాంటి అవకాశమే లేదు. ఎక్కడికన్నా పారిపోదామనిపిస్తోంది"

"మీరెందుకు పారిపోతారండీ? నేను పోతాను. మీరు ప్రశాంతంగా రాసుకోండి..."

"షటప్! నువ్వెక్కడికీ పోవద్దు. మరోసారి ఆ మాటన్నావంటే మర్యాద్దక్కదు..."

*　　　*　　　*

"రాత్రి మీరు తాగొచ్చారు కదూ?" అంది అపర్ణ

"సారీ అపర్ణా! నా ఫ్రెండ్ వైఫ్ అనుపమ చాలా బలవంతం చేసింది. నో అనలేకపోయాను"

"అమె మైకంలో పడిపోయి నాకిచ్చిన మాటను మరచిపోయారన్నమాట" అంటూనే ఆమె పొంగి పొరలి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక అతని మీద పడిపోయి యేడ్చేసింది.

"ప్లీజ్ అపర్ణ, అర్థం చేసుకోకుండా ఇలా యేడ్వొద్దు. ప్లీజ్... స్టాప్ క్రైయింగ్ ఇంత చిన్న విషయానికే ఇంత రాద్ధాంతం చేస్తున్నావేమిటి? నేనేదో రోజూ తాగొచ్చి నిన్ను హింసిస్తున్నానన్నట్టుగా ప్రవర్తిస్తున్నావు. ప్లీజ్ ఊరుకో, ఇలా ప్రతి చిన్న విషయానికీ యేడ్చేవాళ్ళంటే నాకసహ్యం."

"అసహ్యమే. నేనంటేనే మీకసహ్యం నన్ను వదిలేసి మీ ఫ్రెండ్ భార్యతో ఉండిపోండి"

"షటప్ యువర్ బ్లడీమౌత్! యేం మాట్లాడుతున్నావో తెలిసే మాట్లాడు తున్నావా? ఒక్కరోజు ఓ క్లోజ్ ఫ్రెండ్ మ్యారేజిడే కని వెళ్ళొస్తే ఇంత సీన్ క్రియేట్ చేస్తావా? నా ఫ్రెండ్ భార్యను గూర్చి ఇంత నీచంగా మాట్లాడ్తావా? నాకూ ఆమెకు సంబంధం అంటగడ్తావా? ఛీఛీ! ఆడజాతంటేనే అసహ్యం కల్గుతోంది" అంటూనే అతడు ఆమెను వదిలించుకొని ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

తన కేబిన్‌లో కెళ్ళి కూర్చున్నాడు.

అతడు యే పనిమీదా దృష్టిని సారించలేకపోయాడు.

అతని కళ్ళల్లో పదేపదే ఒకవైపు అపర్ణ, మరోవైపు అనుపమ మెదలసాగారు.

అనుపమతో పోలిస్తే అపర్ణ ఎక్కడుంటుంది?

యేం చూసుకొని అపర్ణ తనను ఆమె గుప్పిట్లో పెట్టుకోవాలనుకుంటోంది. అనుపమ కాలిగోరుక్కూడా సరితూగని అపర్ణ ఒక్కరోజు కొంచెం విస్కీ తాగి ఇంటికొస్తే అంత రాద్ధాంతం చెయ్యాలా? ఆమె పట్ల తనెంత ఉదారంగా ప్రవర్తించాడో మరిచిపోయిందా?

తననూ ఆమెనూ పక్కపక్కనే చూసిన వాళ్ళంతా యేమన్నారో ఆమెకు తెలియదా? యే ఊర్వశినో, మేనకనో చేసుకోవలసినవాడిని, ఈమెను, ఓ అతి మామూలు స్త్రీని చేసుకున్నావేమిటని తన ఫ్రెండ్సందరూ తనను గుచ్చిగుచ్చి అడిగారు. ఆమె కోట్ల కట్నం తెచ్చిందా? కేవలం డబ్బు కోసమే ఆమెను చేసుకున్నావా అని అడిగారు. పైసా కట్నం తేలేదంటే ఎవరూ నమ్మలేదు.

బాహ్య సౌందర్యం కాదు, అంతఃసౌందర్యం ముఖ్యమని వాళ్ళతో వాదించాడు. అపర్ణలోని అణకువనూ, వినయాన్నీ చూసి అపర్ణలో ఆ అంతఃసౌందర్యం ఉందనుకున్నాడు. ఒక్క క్షణంలో తనకూ, అనుపమకూ సంబంధం అంటగట్టిన ఆమెలో ఆ అంతఃసైందర్యం కూడా లేదని ఈ రోజు రుజువైపోయింది. అనుపమను చూశాక బాహ్య సౌందర్యం కూడా ఎంత అవసరమో అర్థమౌతున్నది. అనుపమ అపురూప సౌందర్యం ముందు అన్నీ దిగదుడుపేనన్న భావం కల్గుతున్నది. నీతి, ధర్మం, అంతరాత్మ అన్నీ దిగదుడుపే.

ఫోన్ మోగటంతో అనురాగ్ ఉలిక్కిపడి ఈ లోకంలో కొచ్చాడు.

"హలో అనురాగ్! ఎలా ఉన్నారు మీరు?" అవతల్నించి అనుపమ తీయటి కంఠం.

"అయామ్ ఫైన్, థాంక్యూ" అన్నాడు అనురాగ్

"హేంగోవర్ యేమన్నా?"

"యేం లేదు"

"రాత్రి మీ అపర్ణేమన్నా గొడవ చేసిందా?"

"యేం గొడవ చెయ్యలేదు"

"నిజమే చెబుతున్నారా?"

"నిజమే చెబుతున్నాను"

"మీ ఆవిడ గొప్ప పతివ్రతలా ఉందే"

"అవును"

"నేను ఆమె ప్లేస్‌లో ఉంటే మీతో బాగా దెబ్బలాడేదాన్ని"

"దెబ్బలాడే అర్హత మీకుంది"

"ఆమెకు లేదా?"

"లేదు. మీతో పోలిస్తే ఆమె చాలా మామూలు మనిషి"

"నాకున్నదేమిటి? ఆమెకు లేనిదేమిటి?"

"ఎవ్రీథింగ్"

"కాస్త వివరంగా చెప్పండి బాబూ!"

"కలలో కూడా ఊహించుకోలేనంత అపూర్వ అద్భుత సౌందర్యం మీకుంది"

"రియల్లీ? మీరు నిజమే చెబుతున్నారా?"

"ప్రతిరోజూ సూర్యుడు తూర్పున ఉదయిస్తాడన్నంత నిజం చెబుతున్నా..."

"ఓ విషయం చెబితే మీరు ఆశ్చర్యపోతారేమో"

"యేమిటది?"

"మీ ఫ్రెండ్‌కు నా అందమే కనిపించదు. ఎవరన్నా నన్ను చూసి అందంగా ఉన్నావని పొగిడితే ఆయనకు కోపమొస్తుంది. నీదీ ఓ అందమేనా అంటుంటాడు"

"మీ అందానికి అతడు అర్హుడు కాదేమో. కళ్ళు జిగేలు మనిపించే మీ అందం వాడిని గుడ్డివాణ్ణి చేసిందేమో"

ఆమె నవ్వింది. చాలాసేపు నవ్వుతూనే ఉండిపోయింది.

ఆమె ఎప్పుడూ అలా నవ్వుతూ ఉండిపోతే ఎంత బావుండును అనుకున్నాడతడు.

"అందాన్ని ఆస్వాదించటానిక్కూడా అర్హతుండాలి" అన్నాడతడు ఆమెను చాలాసేపు నవ్వనిచ్చి.

"ఈ ప్రపంచంలో మీకు తప్ప ఆ అర్హత ఎవరికీ లేదనిపిస్తోంది" అందామె స్వరాన్ని తగ్గించి

"థాంక్యూ ఫర్‌ది కాంప్లిమెంట్" అన్నాడతడు ఆశ్చర్యంతో చలించిపోతూ.

ఇద్దరి మధ్య కాసేపు నిశ్శబ్దం.

"నేనో కోరిక కోరుతాను... తీరుస్తారా?"

"చెప్పండి"

"అందాన్ని ఆస్వాదించడానికెప్పుడొస్తారు?"

కొన్ని క్షణాల సేపు అతడి గుండె వేగంగా, అతివేగంగా కొట్టుకోసాగింది.

"అంత అదృష్టమా?" అప్రయత్నంగా ఆ మాట అనేశాడు.

"అదృష్టం నాదేనని ఎందుకనుకోగూడదు"

"థాంక్యూ వేరీమచ్...కానీ!!

"కాని ఎందుకు?"

"మీకు ఇంత దగ్గరగా రావడం న్యాయమేనా అని నా అంతరాత్మ ఘోషిస్తున్నది"

"ఎందుకు?"

"ఓ స్నేహితుడికి ద్రోహం చేస్తున్నానేమోనని"

"అంతరాత్మకు లొంగిపోయిన వాళ్ళెవరూ సుఖపడలేరు. ఆయనొచ్చారు. నేను తర్వాత మాట్లాడ్తాను" అంటూనే ఆమె ఫోన్ పెట్టేసింది.

అతడూ ఫోన్ పెట్టేసి జరిగిందేమిటో మననం చేసుకోవడం మొదలెట్టాడు.

ఆమె నిజంగా తనతో అలా మాట్లాడిందా?

అందాన్ని ఆస్వాదించడానికి రండని ఎంత నిర్భయంగా, ఎంత నిస్సిగ్గుగా ఆహ్వానించిందో గుర్తొస్తోంటే అతనికి భయమేసింది. యే స్త్రీయైనా ఓ పర పురుషుణ్ణి అలా ఆహ్వానించగల్గుతుందని అతడింత కాలం ఊహించలేకపోయాడు. శ్రీకాంత్ తన బెస్ట్ ఫ్రెండ్! అంత అందమైన భార్యను పొందటం అతడి అదృష్టం అనుకున్నాడు. అంత ఘనంగా జరిగిన వాళ్ళ మ్యారేజిడేను చూస్తోంటే తనకతనిమీద ఈర్ష్య కల్గింది. అంత అందమైన భార్య తనకు లేదే అని బాధపడ్డాడు. కానీ ఇప్పుడు శ్రీకాంత్ మీద జాలి కల్గుతున్నది. అతని స్థానంలో తనను ఊహించుకున్నాడు. అతనికి ఆశ్చర్యం కల్గింది. అంత బరితెగించిన భార్యను తను భరించలేనని అతనికర్థమయ్యింది.

వద్దు...వద్దు... తనకంత అదృష్టం అక్కర్లేదు. అంత అందమైన భార్యా అక్కర్లేదు. తనకు అపర్ణ చాలు. అనుపమతో పోలిస్తే అపర్ణే ఎన్నోరెట్లు అందమైన దానిలా కనిపించసాగింది.

ఆ సాయంత్రం అతడు ఇంటికెళ్ళగానే అపర్ణను దగ్గరకు తీసుకున్నాడు. గుండెలకు హత్తుకున్నాడు ఆమె గుండెల్లో దూరిపోయాడు.

"సారీ అపర్ణా... ఎక్స్‌ట్రీమ్లీ సారీ. మరోసారి నిన్ను బాధపెట్టను" అన్నాడు.

"నేనే పిచ్చిగా మాట్లాడి మిమ్మల్ని బాధపెట్టాను. నేనే మీకు సారీ చెప్పాలి" అందామె పసిపిల్లలా అతని కౌగిలిలో ఒదిగిపోతూ.

ఆ మర్నాడు అనుపమ అతనికి మళ్ళీ ఫోన్ చేసింది.

"మీ ఫ్రెండ్ బాంబే వెళ్ళాడు. మూడురోజులు దాకా రాడు. మీరీరోజు మా యింటికి రండి" అందామె. "వెళ్దామా?" అనిపించిందతనికి. ఛీఛీ! వెళ్తావా? అని అతని అంతరాత్మ ప్రశ్నించింది.

"చాలా బిజీగా ఉన్నాను. తర్వాత మాట్లాడ్తానని" అతడు ఫోన్ పెట్టేశాడు.

ఆమె మళ్ళీ మళ్ళీ ఫోన్ చేసింది. అతడు ప్రతిసారి అదే సమాధానం చెప్పాడు.

ఆమె ఫోన్ చెయ్యడం మానేసింది.

ఆరు మాసాలు గడిచిపోయాయి.

ఒకరోజు శ్రీకాంత్ "నీ ఆఫీసుకొస్తున్నాని" ఫోన్ చేసి అనురాగ్ దగ్గరకొచ్చాడు.

అతడు అనురాగ్‌ను చూస్తూనే గట్టిగా కౌగిలించుకొని భోరుమని యేడ్చేశాడు.

"యేమైంది శ్రీకాంత్! యేమైంది?" అన్నాడు అనురాగ్. చాలాసేపటి వరకు శ్రీకాంత్ పొంగిపొరలి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు.

బిజినెస్‌లో చాలా నష్టమొచ్చి ఉంటుందా? పార్టనర్‌లలో ఎవరైనా మోసం చేశారా? యేమై ఉంటుందో అనురాగ్ ఊహించడానికి ప్రయత్నించాడు.

"యేం జరిగిందో చెప్పు శ్రీకాంత్?" మళ్ళీ అడిగాడు అనురాగ్.

"అనుపమ నా కన్యాయం చేసి వెళ్ళిపోయింది అనురాగ్" దుఃఖాన్ని ఆపుకుంటూ చెప్పాడు శ్రీకాంత్.

"ఎక్కడకెళ్ళింది?"

"నా జీవితంలోంచి శాశ్వతంగా వెళ్ళిపోయింది"

"యేమైంది?"

"అమెరికాలో ఉంటున్న ఓ మల్టీ బిలియనీర్ ఆమెకు ఇంటర్నెట్ ద్వారా పరిచయమయ్యాడట. వాళ్ళిద్దరు చాలా సార్లు ఇంటర్నెట్‌లో కలుసుకోవడం, యేవేవో డర్టీ జోక్స్ చెప్పుకోవడం, యేవేవో మాట్లాడుకోవడం, ఒకర్నొకరు చూసుకోవడం చాలా కాలంగా జరుగుతోందట. ఈ మధ్య అతడు ఇండియా కొచ్చాడు. మొదటి రోజు ఫ్రెండని పరిచయం చేసింది. రెండోరోజు 'మేమిద్దరం ప్రేమించు కుంటున్నా'మంది మూడోరోజు 'నువ్వంటే నాకు ప్రేమలేదు. నీతో నేను కాపురం

చెయ్యలేను. ఇదిగో విడాకుల పత్రం... సంతకం చెయ్యమని' నా ముందు పెట్టేసింది. నేను సంతకం పెట్టేశాను. అంతే! అతనితో వెళ్ళిపోయింది" అంటూనే అతడు మళ్ళా కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

అనురాగ్ కాస్సేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు.

"జరిగిందేదో నీ మంచికే జరిగిందనుకో శ్రీకాంత్! అనుపమ లాంటి నిన్ను గౌరవించని భార్యతో కాపురం చేస్తూ, అనుక్షణం ఆమె నాతో ఉంటుందా? వెళ్లిపోతుందా? అన్న టెన్షన్‌తో కుమిలిపోతూ బతకడం కంటే ఓ మామూలు స్త్రీని, నిన్ను ప్రేమించే, నిన్ను గౌరవించే స్త్రీని చేసుకొని ప్రశాంతంగా బతకడం బెటర్" అన్నాడు అనురాగ్.

* * *

"మనం బయటకెళ్లి చాలారోజులైంది. ఈ రోజు హాయిగా యేదన్నా సినిమాకో, పార్క్‌కో వెళ్ళొద్దామా?"

"యేమిటి సంగతి? ఈ రోజు చాలా హుషారుగా కనిపిస్తున్నావు?"

"హుషారుగా కనిపించినా తప్పేనా?"

"తప్పని ఎవరన్నారు?"

"యేం మాట్లాడకుండా నా పని నేను చేసుకుంటోంటే చాలా డల్‌గా ఉన్నావేమిటి? అంటారు. మీతో డల్‌గా ఉండాలో, హుషారుగా ఉండాలో తెల్చుకోలేకపోతున్నా"

"డల్‌గా ఉండొద్దు. నువ్వు హుషారుగా ఉంటే నాకూ హుషార్ వస్తుంది"

"అయితే చదవడం ఆపేసి త్వరగా రెడీ అవండి. ఈరోజు యేదన్నా మంచి సినిమా చూసేసి ఆ తర్వాత ఓ మంచి హోటల్లో భోజనం చేసేసి ఇంటికొచ్చేద్దాం... ఓకేనా?"

"నన్ను రెడీకమ్మంటున్నావు. నువ్వు రెడీ అయ్యావా?"

"నేనెప్పుడో రెడీ అయ్యాను. ఇటు చూడండి... నేను కట్టుకున్న ఈ చీరె ఎలా ఉందో చెప్పండి"

"అద్భుతం! అమోఘం! అపూర్వం!"

"నిజమే చెబుతున్నారా? నన్ను యేడిపించడానికంటున్నారా?"

"నిజమే చెబుతున్నాను. ఆ చీరెలో నువ్వు బాగున్నావో, నువ్వు కట్టుకున్నందుకు ఆ చీరె బావుందో తేల్చుకోలేకపోతున్నాను"

"వేళాకోళానికంటున్నారు"

"కాదు... సీరియస్‌గా అంటున్నాను. ఈ చీరెలో నువ్వు చాలా అందంగా ఉన్నావు... సింప్లీ ఎక్విజిట్!

"నిజంగా... నిజంగా అంత అందంగా ఉన్నానా? నేనో మామూలు మనిషిని కదా"

"అదే నీ ప్రత్యేకత... మామూలు మనుషుల్లోనే అందం ఉంటుంది. వాళ్ళ వల్లే పక్కనున్న వాళ్ళకు ఆనందం కల్గుతుంది"

"మీకో విషయం చెప్పనా?"

"యేంటది?"

"మీరు రాసిన ఆ అనురాగ్ అపర్ణల కథ చాలా బావుంది"

"నిజంగానా? నీకు నచ్చిందా?"

"నాకు నచ్చింది"

"నా ఇదివరకటి కథలేవీ నీకు నచ్చేవికావు. నా కథలు భార్యల్ని కించపరచేవిగా ఉంటాయనేదానివి..."

"యేమో... నాకు తెలీదు. కానీ ఈ కథ బావుంది."

– *'నవ్య' వారపత్రిక, 11-10-2006*

కథా నిలయం
శ్రీకాకుళం